


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### అరుగు అరిగిపోతుందా?

**మా చిన్నతనంలో** అరుగులు లేని ఇళ్ళు వుండేవికావు. 'తీరైన సంపదా ఏ ఇంట నుండూ?' అంటే 'అరుగులలికే వారి అరచేతనుండూ' అనేవారు.

అరుగు మీద రిటైర్ అయిన తాతగార్లు కూర్చుని "ఎవరా వెళ్ళేదీ?" అని హూంకరించి అడిగితే,

"నేనండీ నారప్పగారి చిన్నప్పడిని" అని వెళ్ళే అతను ఆగి జవాబిస్తే "ఏరా.. చిన్నప్పడూ.." అని దగ్గి, గొంతు నీరసంగా పెట్టి, "జ్వరపడ్డాను. నాలుగు రోజులయింది, సుస్తీ చేసాక అస్సలు గొంతు లేవడం లేదురా" అని బలహీనంగా మాట్లాడేవారు.

చిన్నప్పడు అరుగు మీద కూర్చుని "అయ్యో పత్యం తిన్నారా? సాయంకాలం నాలుగు బొండాలు దింపి తెస్తానండి. గంగా బొండాలండి. ఓపిక అదే లగెత్తుకు వచ్చేస్తుంది" అని నాలుగు మాటలు మాట్లాడి వెళ్తే అదో గొప్ప వూరట.

ఇంక మగాళ్ళు ఆఫీసులకీ, పిల్లలు బళ్ళకీ వెళ్ళాక, చాటలో బియ్యం పోసుకుని ఏరుకోడానికి చిట్టత్తయ్యా, వత్తులు చేసుకోడానికి మాఅమ్మమ్మా, బీడీలు చుట్టుకోడానికి సందానీ తల్లీ మా అరుగుమీద చేరేవారు.

"పంతులమ్మా ఆ చిట్టితల్లి మొగుడు కొయిటం పోయిండు అంటుంది కానీ ఇక్కడే వున్నాడట. ఇంకో పెళ్ళాం వుందిట" అని సందానీ తల్లి మొదలు పెడితే, ఆమె చేతిలోంచి పని అందుకుంటూ మా శ్యామలమ్మ "నా మొదటి మొగుడే గుర్తొసాడు ఆ చిట్టితల్లి మొగుడ్ని చూస్తే. ఎర్రగా పాలకోవాకి కాచిన పాలమీగడ రంగు" అనేది.

"మరి ఆ చిట్టితల్లి తల్లి నా అల్లుడు బంగారం అంటుందే ఈ సంగతి ఆవిడకి తెలుసా?" అని చిట్టి అత్తయ్య అడిగితే, "ఐదో నెల పడ్డాక ఇంట్లో చెపితే, ప్రేమ సంగతి ఏవంటుంది బంగారం అనక. కడుపు చించుకుంటే కాళ్ళమీద పడ్తుంది" అంది శ్యామలమ్మ.

ఇవన్నీ అరుగు చివర్న కూర్చుని గచ్చకాయలు ఆడుకుంటున్న నా చెవినా, మా భవాని చెవినా పడ్తున్నా, 'ఈ కడుపు చించుకోవడం' అంటే అర్ధమయ్యేది కాదు. పోనీ వెళ్ళి "ఈ నెల పడడం, కడుపు చించుకోవడం అంటే ఏవిట్రా? మీ లాంగ్వేజ్ బొత్తిగా అర్ధంకావడంలేదు. అర్ధం అయ్యేట్లు చెప్పండి. నాన్సెన్స్" అందామంటే, అరుగు మీద సివంగిలా అమ్మమ్మ గట్టిగా జబ్బ మీద గుచ్చి పట్టుకుని "నేను చెప్తా.. ఇంట్లోకి పద" అని చంపేస్తుంది.

ఇంతలో సందానీ వచ్చి, ఎక్కడినుండి పట్టుకొచ్చాడో సైకిల్, గంట కొట్టి "ఏ.వీ రమణీ సైకిల్ తొక్కుదం రా.. ఆడపిల్ల లెక్క గచ్చకాయలేం ఆడ్తావు తీ" అనేవాడు.

మేం అరుగు ఖాళీ చేసాక పోస్ట్‌మేన్ గౌస్ అంకుల్ వచ్చి అరుగు మీద కూర్చుని అమ్మమ్మ ఇచ్చిన మజ్జిగ తాగుతూ "ష్! ఇంకా ఆ చివర లైనులో మూడు ఉత్తరాలు ఇవ్వాలి. సన్యాసిరావు ఇంట్లో డేనియల్ ఇంట్లో, టైలర్ శ్రీశైలం ఇంట్లో, చిట్టితల్లి ఇంట్లో" అనగానే, మా శ్యామలమ్మ డిటెక్టివ్‌లా "అన్నా.. చిట్టితల్లి మొగుడు రాసాడా? కొయిటం నుండే రాసాడా? కొయిటం స్టాంపులుకి పిల్లలు ఆశపడ్తార్లే అన్నా" అందిట.

దానికి గౌస్ అంకుల్, "ఏం కొయిటం.. ఇక్కడే దేవరయామిజాల నుండి రాస్తున్నాడు, క్వారీలో పనిమీద వెళ్ళాడుట" అని విశ్వరహస్యం చెప్పేసేవాడు. అరుగు మీద మీటింగ్ అర్ధవంతం అయి ముగిసేది.

కొండ చీపుళ్ళు అమ్మే అంజమ్మ, చీపుళ్ళు దింపి "పంతులమ్మా మంచినీళ్ళు పొయ్యి జరంత" అనేది. మంచినీళ్ళు తాగి, తాగొచ్చి తన్నేమో గుడి గురించీ సందానీ తల్లితో ముచ్చట్లు చెప్పేది. పెరుగు నారాయణ వచ్చి, "ఎరుగు గెడ్డవుంది. తియ్యని పెరుగు" అని ఒక బిళ్ళ కాసిని నీళ్ళూ చుట్టుపక్కల వాళ్ళకి అమ్మి అమ్మమ్మ పెట్టే పొద్దుట చేసిన ఉప్మానో, ఇడ్లెన్ ముక్కో బాదం ఆకులో పెడితే తిని, సపోటా చెట్టు మొదట్లో చేతులు కడుక్కుని, మిలటరీలోకి వెళ్ళిన కొడుకు గురించీ, అతను రాసే ఉత్తరాల గురించీ అమ్మమ్మకి చెప్పి వెళ్ళేవాడు. సాయంత్రాలు మా జెస్సీ డేవిడ్ సార్ వచ్చి, ఆ అరుగు మీదే ట్యూషన్ చెప్పేవాడు.

సుశీల తండ్రి చచ్చిపోతే, ఆ ఇంటి ఓనర్, శవాన్ని తేడానికి వల్లకాదంటే, అమ్మమ్మ "మా అరుగుమీద దింపండి శవాన్ని. పోయిన తర్వాత శవం కాదు శివం. ఆ పరమాత్మలో ఐక్యం అయ్యాడు పెద్దాయన. ఏం రేపు మనం పోమా?" అంది.

ఆ శివ కార్యాలు అన్నీ మా అరుగుమీదే అయ్యాయి. ఆ అరుగు మీద కూర్చుని చిన్నతనంలో గంగిరెద్దుల వాళ్ళొస్తే సంక్రాంతికి ఎద్దులని ఆడిస్తే వినోదం చూసాం. ఆ ఇంటి అరుగుమీదే కూర్చుని పాములాడించే అతనొస్తే, పాలు పోసి మూకుడులో, పాము తాగుతుంటే చప్పట్లు కొడ్తూ చూసాం. కోతులాడించేవాళ్ళు, నవారు నేసే వాళ్ళు, మాట్లు వేసేవాళ్ళు, కత్తికి పదును పెట్టేవాళ్ళు, "నేత చీరలండీ" అంటూ వచ్చేవాళ్ళు, గాజుల మలారం తాత, బొంబాయి మిఠాయి సాయిబు, "బొట్టుబిళ్ళలు, కాటుక కాయలు, పిన్నీసులు, మొలతాళ్ళు, దువ్వెనలు, దిష్టి పూసలు, గొలుసులు,"అని వచ్చే ఎరుకల వాళ్ళూ, అరుగుమీదే గంపలు దింపేవాళ్ళు.

"ఇంకో పాత సీర ఎయ్యి తల్లీ, బంగారం లాంటి గంగాళం ఇచ్చి" ఇచ్చే అమ్మిలూ, అమ్మకుండానే ఇంటెడు బట్టలు తీసుకుని, ఒక చిట్టి స్టీలు డబ్బా ఇచ్చి పోతూ పోతూ "సూలింతనమ్మా కాస్త పచ్చడి ముక్కెట్టండమ్మా" అంటూ చింతకాయో, గోంగూర పచ్చడో పట్టుకెళ్ళేవాళ్ళు.

హరికథ పందిట్లో జరుగుతున్నా, మేం అరుగుల మీదే కూర్చుని చూసేవాళ్ళం. హరిదాసులకి మా ఇంట్లోంచి పాలూ మిరియాలూ వెళ్తే, మాకు పందిట్లోంచి శనగలూ, పులిహోరా వచ్చేవి.

"సత్యవతీ మేడం జర చాయ్ తాగిపించు" అని అమ్మ ఆఫీస్‌లో పని చేసే మస్తాన్ గారు వచ్చినా, "సత్యా.. ఇదిగో ఊరినుండి తేగలూ రేగుపండ్లూ తెచ్చాను పిల్లలకి ఇవ్వు" అని రాజమణి ఆంటీ వచ్చినా, మా అరుగు బాతాఖానీకి రచ్చబండ అయ్యేది.

"నేలనా? బండనా?" అంటూ మేం తెగ అరుగులు అరిగేలా ఎగిరేవాళ్ళం.

ఆ అరుగుకి హమేషా గిరాకీ. ఊరమిరపకాయలు పోసేది అమ్మమ్మ, అనసూయా వాళ్ళమ్మా, చిట్టెత్తయ్యా అప్పడాలు ఆరబెట్టినా, శ్యామలమ్మ మురుకుల గిద్దతో పిండివడియాలు పెట్టినా, మావిడికాయ సీజన్‌లో, గింజ తీస్కోడానికీ, అన్ని కాలాల్లో బియ్యాలు బాగు చేసుకోడాలూ, అస్సలు అరుగు బోసిపోకుండా, ఎల్లవేళలా, మా అమ్మమ్మ దొండ ఒరుగులో, కొబ్బరి చిప్పలో, ఎండు మిరపకాయలో, పప్పులో, ఉప్పులో ఏవో ఒకటి ఎండపెడ్తూనే వుండేది.

అసలు కాలనీ అంతా కళకళలాడిపోయేది మాత్రం బట్టల పెట్టెలు పట్టుకుని, చీరాలనుండి గవర్రాజు గారొచ్చినప్పుడు, "పేటేరు మీకు బావుంటుంది పిన్నిగారూ, చక్కగా ఒడ్డూ పొడవుగా వుంటారు. బండారులంక అమ్మాయి గారి ఆఫీసుకి బావుంటాయి అండి.. వరలక్ష్మి అక్కయ్యగారూ గుంటూరు జరీ చీరలు తప్ప మీకు సూట్ కావండీ, వరయూరు, సీతమ్మగారి కండీ, చింతచిగురు రంగు అడిగి తెప్పించుకున్నారు. వెంకటగిరి మరి పేరంటాలకి తీస్కోరుటండీ. వచ్చేది శ్రావణ మాసం అసలే. ఉప్పాడ జరీ చీరలు పెళ్ళిళ్ళకి ప్రసిద్ధం అండీ. పెడన మామ్మగారికండీ, పుల్లేటుకూరు తువ్వాళ్ళు అండీ, ధర్మవరం, కోటకొమ్మచ్చూలో అత్తాకోడళ్ళ అంచులున్నాయండీ" అంటూ మాటల్లోంచి, అల్లావుద్దీన్ అద్భుతదీపం, జీనీలా రకరకాల చీరలు పరుస్తూనే వుండేవారు. అరుగుకి వయసొచ్చి ఓణీ వేసుకున్నట్లూ, సంక్రాంతొస్తే పెయింట్ ముగ్గులతో మెరిసిపోయేది. దీపావళి వస్తే అరుగు చివర్ల నిండా దీపాలతో వజ్రతోరణాల్లా కళ్ళు మిరిమిట్లు గొలిపేవి.

ఏవీ లేకపోయినా, వేసవి కాలంలో బాటసారులు, దారిన పోతూ వచ్చి, ఎండకి అరుగుమీద కాసేపు కూర్చుని సేద దీరేవారు. అమ్మమ్మ కొబ్బరి చిప్పకి కాడ గరిట పెట్టి, చల్లని నీళ్ళు అరుగుమీద, గోనెబట్ట తడిపి చుట్టిన కుండలో పెట్టేది. కాసిని నీళ్ళు తాగి, తలపాగా విప్పి పరుచుకుని, ఎందరో ఆదమరిచి కాస్త కునుకు తీసి బడలిక తీర్చుకునేవారు.

మాకు చదువులు చెప్పిన సరస్వతీదేవిలా ఆ అరుగు, మాకు ముచ్చట్లు చెప్పిన పేదరాశి పెద్దమ్మలా ఆ అరుగు. మాకు పనీపాటలు నేర్పిన పంతులమ్మ ఆ అరుగే. మా ఆటపాటలకి మురిసిపోయే మా తోటి నేస్తం ఆ అరుగే. కష్టానికి ఓదార్పు నిచ్చిందీ, ఆనందాలకి ఆలవాలమైందీ ఆ అరుగే.


"ఇల్లెంత వుంటేనేం అరచేయి వెడల్పంతైనా అరుగు లేకుంటే" అనేది అమ్మమ్మ.

అమ్మమ్మ తల్లి, మా ముత్తవ్వ, ఆ అరుగుమీదే మంచం మీద పడుకుని, గోవిందనామాలు పాడుతుంటే విన్నాం, అమ్మమ్మ ఆ అరుగుమీదే మాకు రెనిన్ అండ్ మార్టిన్ గ్రామర్ నేర్పితే నేర్చుకున్నాం, సందానీ తండ్రి తాగొచ్చి ఆ అరుగుమీదే ఎక్కి అరుస్తుంటే, సందానీ తల్లి లాక్కుపోతుంటే, కాలక్షేపంగా చూసేవాళ్ళం. మా చిన్నతనంలో సరదాలు, సందళ్ళు, కొట్లాటలు, ఏడుపులు, పంచాయితీలు, పనీపాటలు, ఆటలు, ఆనందాలు అన్నింటికీ సాక్షిభూతంగా నిలిచింది మా అరుగే.

ఈ అపార్ట్‌మెంట్‌ల కల్చర్‌లో, తలుపులు మూసుకోవడమేకానీ, "కాసేపు కూర్చో. నీ బాధలేంటో నాతో చెప్పు. కాస్త దాహం పుచ్చుకో, అలిసిపోతే కాస్త కునుకు తియ్యి" అనే అరుగులేవీ? సాటి మనిషి సాహచర్యం కన్నా సెల్‌ఫోన్, టీ.వీ సోషల్ మీడియా ఎక్కువైపోయిన ఈ రోబోట్‌ల యుగంలో, మానవ సంబంధాలన్నీ యాంత్రికం అయిపోయాయి. ఉత్తరాలు తెచ్చే పోస్ట్ మావయ్యలు లేరు. ఈ మెయిల్స్ తప్ప. గుమ్మం దగ్గరకొచ్చి అమ్మే పాలూ, పెరుగూ, కూరలూ లేవు. చెప్పినంత ధర మారు మాట్లాడకుండా, కార్డ్ గీసి కొనుక్కునే సూపర్ మార్కెట్‌లు తప్ప. పక్కింటి పిన్నిగార్లూ, కష్ట సుఖాలకి అయ్యే ఇరుగు పొరుగు అక్కయ్యలూ, ఎంత ఖరీదు అయినా కమ్యూనిటీల్లో వుంటే అంత కరువు. ఈ కృత్రిమత్వంలో, పొరుగు పొడగిట్టని సమూహాల్లో, ఇగిరిపోయిన మానవసంబంధాల్లో దీపనిర్వాణ గంధంలా ఎక్కడైనా అరుగు కనిపిస్తే అరువు అడిగైనా కాసేపు సేద తీరండి. అరుగు అలిగిపోయిందా వీళ్ళని చూసి చూసి, లేదా అరిగిపోయిందా?

Post your comments







https://www.youtube.com/watch?v=ERaaX_IulS4